ప్రజాశక్తి

బుధవారం 23 జూలై 2025

I

అల్లూరి సీతారామరాజు

నాణ్యమైన మెనూ అందించండి

విద్యార్థులతో మాట్లాడుతున్న సదా భార్గవి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఆశ్రమ పాఠశాలలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు సదా భార్గవి ఆదేశించారు. మంగళవారం గుత్తులపుట్టు ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమపాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా మరుగుదొడ్లను, వసతి గృహాన్ని, వంటశాలను సందర్శించారు. మరుగుదొడ్లను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన మెనూను అమలు చేయాలని స్పష్టం చేశారు. విద్యార్థులతో మాట్లాడి విద్య, వసతి సౌకర్యాలను, మెనూ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఐటిడిఎ ఇన్‌ఛార్జి పిఒ, జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజె అభిషేక్ గౌడ, ఐటిడిఎ ఎపిఒ ఎం.వెంకటేశ్వరరావు, ఎటిడబ్ల్యూఒ అఖిల పాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ హాస్టల్ భవనాన్ని

నిర్మించినా.. ప్రారంభించరేం?

• రెండేళ్లుగా గిరిజన విద్యార్థినుల అవస్థలు • అధికారుల నిర్వాకంపై ఎస్ఎఫ్ఐ ఆందోళన

రెండేళ్లుగా తాళాలు వేసి ఉన్న హాస్టల్ భవనాన్ని పరిశీలిస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: అరకులోయ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రారంభించి రెండేళ్లు గడిచినా, నేటికీ దీని పరిధిలోని హాస్టళ్లను ప్రారంభించకపోవడంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి ఎస్ ఐసుబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ నాయకుడు పాంగి రామన్న అన్నారు .మంగళవారం ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో ఎస్ఎఫ్ఐ నాయకుల బృందం పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అరకులోయ ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల హాస్టల్ నిర్మాణం చేసి రెండేళ్లగడిచినా నేటికి ప్రారంభించకపోవడం దారుణం అన్నారు. హాస్టల్‌ను వినియోగంలోకి తేవడతో అధికారుల నిర్లక్ష్యం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో చదువుతున్న దాదాపు 500 మంది విద్యార్థినులు అవస్థలు పడాల్సి వస్తోందన్నారు. దీంతో కో ఎడ్యుకేషన్ డిగ్రీ కళాశాల వసతిగృహంలో ఉంటూ కళాశాలకు వెళ్లవలసిన పరిస్థితి వస్తుందన్నారు. ప్రస్తుతం వసతి పొందుతున్న చోటు నుంచి మహిళ డిగ్రీ కళాశాలకు వెళ్లాలంటే ఒక్కో వైపునకు రెండు కిలోమీటర్ల దూరం కాలినడకన వెళ్లాల్సి వస్తోందని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు .కళాశాల వసతి గృహం చుట్టూ రక్షణ గోడ నిర్మాణం చేసి మహిళలకు రక్షణ కల్పించాలన్నారు.గిరిజన విద్యార్థినులకు సరైన హాస్టల్ సదుపాయం కల్పించి నాణ్యమైన విద్య అందించే విధంగా ఐటిడిఎ, విద్యాశాఖ అధికారులు చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. తక్షణమే వసతిగృహం ప్రారంభించి కళాశాలలోనే విద్యార్థులకు వసతి, భోజనం సదుపాయం కల్పించాలన్నారు. లేనిపక్షంలో విద్యార్థులతో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థినులు కిల్లో మహాలక్ష్మి, కిల్లో గౌరీ, కిల్లో సరోజ, తామల జ్యోతి, జి అనుష్క, కూడ నాగశ్రీ, కోడపురి దివ్య పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రైవేటు పాఠశాల నిర్వాకం

• అనుమతి లేకుండానే ఉన్నత తరగతుల నిర్వహణ
• విద్యార్థులకు శాపంగా అధికారుల పర్యవేక్షణా లోపం
• ప్రభుత్వ పోర్టల్‌లో పేర్లు లేక 'తల్లికి వందనం' దూరం

చింతపల్లిలో ఉన్నత తరగతులకు అనుమతులు లేవని ఆరోపణలున్న ప్రైవేటు పాఠశాల

ప్రజాశక్తి- చింతపల్లి: మండల కేంద్రంలో ఒక ప్రైవేట్ పాఠశాల నిర్వాకం విద్యార్థులకు శాపంలా మారుతోంది. అప్‌గ్రేడేషన్‌కు అనుమతి లేకుండా పై తరగతుల నిర్వహణతో వారి భవిష్యత్ గందరగోళంగా మారడంతోపాటు ప్రభుత్వ విద్యాసంక్షేమ పథకాలకు దూరం కావాల్సిన పరిస్థితి ఉత్పన్నమంది. దీనిపై సంబంధిత అధికారుల పర్యవేక్షణాలోపమే కారణమనే ఆరోపణలు వస్తున్నాయి. ఫలితంగా ప్రభుత్వ పోర్టర్‌లో విద్యార్థుల పేర్లు లేకపోవడంతో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అందించిన తల్లికి వందనం ప్రోత్సాహకాన్ని కోల్పోయిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది.
అందిన వివరాలివి. చింతపల్లి మండల కేంద్రంలో నిర్వహిస్తున్న కింగ్స్ ఆర్మీ పాఠశాలకు 5 వ తరగతి వరకు పర్మిషన్ ఉంది.రెండేళ్ల క్రితం అప్ గ్రేడ్ కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేశారు. అయితే ప్రభుత్వం నుంచి అనుమతి రాకున్నా, ఆ పాఠశాల యాజమాన్యం అదే పాఠశాలలో 5 వ తరగతి చదువుతున్న విద్యార్థులను 6వ తరగతిలోకి ప్రమోట్ చేసి కొనసాగించింది. కానీ ఆ ఏడాది కూడా ఆ పాఠశాలకు అప్ గ్రేడ్ పర్మిషన్ రాలేదు. అయినప్పటికీ అదే విద్యార్థులను 7వ తరగతి లోకి ప్రమోట్ చేసి కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఆ ఏడాది కూడా ఆ పాఠశాలకు ప్రభుత్వ అనుమతులు రాలేదు.
రెండేళ్లుగాపర్మిషన్ లేకుండా ఉన్నత తరగతులు నిర్వహించడంతో ఆ విద్యార్థులు పేర్లు ప్రభుత్వ పోర్టర్‌లో లేకుండా పోయాయి.
ఈ విషయమై చింతపల్లి ఎంఇఒ పనసల ప్రసాద్‌ను వివరణ కోరగా, కింగ్స్ ఆర్మీ యాజమాన్యం పాఠశాల అప్ గ్రేడ్ కోసం దరఖాస్తు చేశారన్నారు. ఆ పాఠశాలకు ప్రస్తుతానికి 5వ తరగతి వరకు మాత్రమే పర్మిషన్ ఉందని అన్నారు. 5వ తరగతి పూర్తవగానే ఆ విద్యార్థులు డ్రాప్ బాక్స్‌లో ఉంటారని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలో తమ పిల్లలను చదివించే తల్లిదండ్రులు, ఆ పాఠశాల అనుమతులు సరి చూసుకోవాలని తెలిపారు. ఈ ఏడాది కూడా అప్ గ్రేడ్ పర్మిషన్ రాకుంటే తరువాత పరిణామాలు ఏంటని విద్యార్థుల తల్లిదండ్రులు తలలు పట్టుకుంటున్నారు.

విద్యుత్ స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకించండి

• సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చిన్నయ్య పడాల్

క్యూఆర్ కోడ్ ఉన్న స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న చిన్నయ్యపడాల్

ప్రజాశక్తి- చింతపల్లి: అదానీ విద్యుత్ స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును గృహ, వ్యాపార వినియోగదారులు వ్యతిరేకించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బోనంగి చిన్నయ్య పడాల్ పిలుపునిచ్చారు. మంగళవారం. పార్టీ మండల కార్యదర్శి పాంగి ధనుంజయ్‌తో కలిసి. చింతపల్లి పంచాయతీ కొత్త వీధి గ్రామంలో సిపిఎం రాష్ట్ర కమిటీ ముద్రించిన. క్యూఆర్ కోడ్‌ను గ్రామస్తులతో కలిసి ఆవిష్కరించారు. స్మార్ట్ మీటర్లు పెట్టొద్దు, ట్రూఅప్ చార్జీలు, సెకీ ఒప్పందాన్ని రద్దు చేయాలని, భారాలు పెంచే స్మార్ట్ మీటర్లను విద్యుత్ వినియోగదారులు క్యూఆర్ కోడ్ తో వ్యతిరేకించాలని కోరారు.
ఈ సందర్భంగా చిన్నయ్యపడాల్ మాట్లాడుతూ, ఇప్పటికే ట్రూఅప్, ఇంధన సర్దుబాటు ఇతరత్రా పేర్లతో వినియోగదారులపై వేలకోట్ల భారం వేసిన రాష్ట్ర ప్రభుత్వం, ఇపుడు స్మార్ట్‌మీటర్లతో నిండా ముంచాలని చూస్తోందని మండిపడ్డారు. ఈ మీటర్లును బిగించిన తర్వాత ప్రీపెయిడ్‌గా బిల్లులు చెల్లించాల్సిన పరిస్థితిలో రీఛార్జీ అయిపోయిన వెంటనే కరెంట్ కట్ అయిపోతుందన్నారు. అంతేకాక ప్రజలు వద్దంటున్నా బలవంతంగా బిగించాలని చూస్తున్న ఈ మీటరు ధరను కూడా వినియోగదారులతో వాయిదాల పద్ధతిలో వసూలు చేయాలని చూడడం మరింత దుర్మార్గమన్నారు. వినియోగదారులపై భారం వేస్తూ, అదానీకి అడ్డగోలుగా దోచిపెట్టాలని చూస్తున్న ప్రభుత్వం కుట్రలను ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని ఆదానీ మీటర్లు తెస్తే బిగించకుండా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలోనే స్మార్ట్‌మీటర్లను ఏర్పాటు చేయాలని చూస్తే, వ్యతిరేకించడంతోపాటు వీటిని బిగిస్తే బద్దలు కొట్టాలని పిలుపునిచ్చిన కూటమి నేతలే నేడు వీటిని ఏర్పాటు చేయాలని చూస్తున్నారని, దీన్ని ప్రతిఘటించాని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో. సిపిఎం మండల కార్యదర్శి పాంగి ధనుంజయ్. మజ్జి రాంబాబు, బిట్టు పాల్గొన్నారు.

స్మార్ట్‌మీటర్లతో దోపిడీ చేస్తే సహించేది లేదు

ప్రజాశక్తి-విఆర్‌పురం: స్మార్ట్‌మీటర్ బిగించి వినియోగదారులపై అధికభారం మోపితే చూస్తూ ఊరుకోమని సిపిఎం మండల కార్యదర్శి పులి సంతోష్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం నిర్వహించిన సదస్సులో ముందుగా కేరళ మాజీ ముఖ్యమంత్రి పార్టీ సీనియర్ నాయకులు అచ్యుతానందన్ మృతికి పార్టీ నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించి సంతాపం తెలిపారు. అనంతరం రేకపల్లి సిపిఎం కార్యాలయంలో పూనం ప్రదీప్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సదస్సులో పులి సంతోష్‌కుమార్ మాట్లాడారు.
స్మార్ట్ మీటర్లు వస్తే, విద్యుత్ భారాలు మరింత పెరుగుతాయని, ఒక్కొక్క మీటర్ ఏర్పాటుకు రూ.9వేలు ఖర్చు అవుతుందని, ఈ సొమ్మును వినియోగదారుల నుంచి వసూలు చేస్తారన్నారు. దీన్ని ప్రజలంతా వ్యతిరేకించాలని కోరారు. ఎంపిపి కారం లక్ష్మి, మండల కార్యవర్గ సభ్యులు పంకు సత్తిబాబు, కారం సుందరయ్య, నాయకులు పోడియం. శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పులి సంతోష్‌కుమార్

ప్రయారిటీ గ్రామాలన్నింటికీ..

పునరావాసం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ పూర్తి చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్

ప్రజాశక్తి-కూనవరం: ప్రయారిటీ గ్రామాలన్నింటికి పునరావాసం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజి త్వరితగతిన ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక మార్తా శ్రీరామమూర్తి భవనంలో పాయం సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సిపిఎం జనరల్ బాడీ సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలవరం పేరుతో ప్రయారిటి నిర్వాసిత గ్రామ ప్రజలను తీవ్ర గందరగోళానికి గురిచేస్తూ పునరావాసం తాడువయి ప్రాంతంలో చూపిస్తూ ఒకే ప్రాంతం కాకుండా 5 ఎకరాలు, 4 ఎకరాలు, 3 ఎకరాల పేరుతో కుల ప్రాతిపదికన విడదీస్తూ పిడిఎఫ్ అర్హత కలిగిన వారి లిస్టు ఇంతవరకు పూర్తిస్థాయి రాకుండానే పునరావాసం పేరుతో నిర్వాసితులను తీవ్ర మానసిక క్షోభకు గురిచేస్తున్నారన్నారు. ఇకనైనా పూర్తి ఆర్‌అండ్‌ఆర్ పిడిఎఫ్ బహిర్గతం చేసి నిర్వాసిత ప్రజల గందరగోళానికి తెరదించాలి లేని పక్షంలో నిర్వాసితులతో సిపిఎం ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కమిటి సభ్యులు మేకల నాగేశ్వరావు, ఐ.వెంకటేశ్వరావు, సీనియర్ నాయకులు నానుపల్లి వెంకటేశ్వర్లు, తలగాని నాగరాజు, మండల కమిటి సభ్యులు తాల్లూరి శ్రీను, కర్నాటి శ్రీనివాసరావు, బొగ్గా సుబ్బయ్య, తెల్లం తమ్మయ్య, మడెం బాబురావు, మడకం పొదయ్య, ఎంపిటిసి ధర్మల అమ్మాజీ, సర్పంచులు బొగ్గా రామారావు, సోడే శంకర్, బొగ్గా వెంకమ్మ శాఖ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్

నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తాం

ప్రజాశక్తి - విఆర్.పురం: మండలంలోని ప్రజాప్రతినిధులు వడ్డీగూడెం సర్పంచ్, సోడి నర్సమ్మ, వైస్ ఎంపిపి ముత్యాల భవాని, చినమ్మట్టపల్లి సర్పంచ్ పిట్టా రామారావు ఆధ్వర్యంలో చింతూరు ఐటిడిఎ పిఒని కలసి నిర్వాసితుల సమస్యలు వివరించారు. పిఒ మాట్లాడుతూ మెజారిటీ నిర్వాసితులు కోరుకున్న చోట కాలనీలు నిర్మిస్తామని వడ్డీగూడెం పంచాయతీలో సుమారు 150, ధర్మాతల గూడెం 5, బంగారం, ఎస్సీ కాలనీ 209, ఇంటివిలువ పత్రాలు త్వరలోనే ఇస్తామని నిర్వాసితులు ఎవరూ దళారులను నమ్మవొద్దని, మీకు అండగా నేనున్నానని పిఒ అపూర్వభరత్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు, ఎస్సి సెల్ రాష్ట్ర నాయకులు మాచర్ల గంగయ్య, ఆర్‌టిఐ విభాగం అధ్యక్షులు బొడ్డు సత్యనారాయణ, జిల్లా అధికారప్రతినిధి చిక్కాల బాలకృష్ణ, చినమ్మట్టపల్లి సర్పంచ్ పిట్టా రామారావు, రాష్ట్ర నాయకులు ముత్యాల మురళి, మండల నాయకులు ముత్యాల గౌతమ్, పీసా అధ్యక్షులు కోటం జయరాజు, ఎస్సీ సెల్ నాయకులు చీమల కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

పిఒకు వినతిపత్రం ఇస్తున్న నిర్వాసితులు

ఇదెక్కడి చోద్యం!

• బడిలోనే బాల కార్మికుడిగా విద్యార్థి • తల్లిదండ్రులు, గిరిజనుల మండిపాటు

పాఠశాలలో ఉల్లిపాయలు కోస్తున్న విద్యార్థి

ప్రజాశక్తి-అనంతగిరి : తాము కష్టబడుతున్నా తమ పిల్లలు బాగా చదవాలని, ఉన్నతస్థానాలకు ఎదగాలని ఆకాంక్షిస్తూ గిరిజన తల్లిదండ్రులు ఎంతో ఆశతో తమ పిల్లలను ప్రభుత్వ బడులలో చేర్పిస్తే, అసలు విషయాన్ని పక్కనపెట్టి, అక్కడ తమ పిల్లలతో పనులు చేయిస్తూ, చదువుకు దూరం చేయడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఎన్నో ఘటనలు వెలుగుచూసినప్పటికీ, ఇంకా ఎక్కడో ఒకచోట అలాంటి పరిస్థితులే పునరావృతం కావడంపై ఆందోళన వ్యక్తమౌతోంది. తాజాగా పెద్దబిడ్డ బాలుర ఆశ్రమ పాఠశాలలో విద్యార్థితో కూరగాయలు. ఉల్లిగెడ్డలు. కోయిస్తున్న దృశ్యం స్థానిక విలేకరుల దృష్టికి పడింది. మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న కొత్తవలస బాలుర పాఠశాలలో కూడా ఇలాంటి ఘటనే చోటుచేసుకున్నా దానిపై కఠినచర్యలు లేకపోవడం, విద్యాశాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణాలోపం వల్లే పదేపదే ఇలాంటి ఘటనలు పునరావృత మౌతున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా పాఠశాలల యాజమాన్యాలు తీరుమార్చుకోవాలని, చదువుకోవడానికి పాఠశాలలు, ఆశ్రమాలకు పంపించిన పిల్లలను పనివాళ్లుగా మార్చి బాల కార్మికులను చేయడం దుర్మార్గమని పలువురు మండిపడుతున్నారు. దీనిపై సంబంధిత అధికారుల స్పందన, చర్యలు ఎలా ఉంటాయో చూడాలి.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

మాట్లాడుతున్న పిఒ కట్టా సింహాచలం

ప్రజాశక్తి - రంపచోడవరం : ఏజెన్సీలో యాక్షన్‌ప్లాన్ ప్రకారం గిరిజన విద్యాభివృద్ధి చేసేందుకు తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని రంపచోడవరం ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఐటిడిఎ సమావేశ భవనంలో రంపచోడవరం, చింతూరు డివిజన్లకు సంబంధించిన మండల విద్యాశాఖాధికారులతో, సహాయక గిరిజన సంక్షేమశాఖ అధికారులతో, ఏకలవ్య, గురుకులాల ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులతో పిఒ కట్టా సింహాచలం, గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, ఏజెన్సీ డిఇఒ వై.మల్లేశ్వరరావు సమావేశం నిర్వహించారు. పిఒ సింహాచలం మాట్లాడుతూ రంపచోడవరం, చింతూరు డివిజన్ పరిధిలో ఉన్న గిరిజన విద్యార్థులు పోటీ పరీక్షలలో మంచి మార్కులతో పాస్ అయ్యేవిధంగా అంతా కృషి చేయాలన్నారు. 11 మండలాల్లో 11 టీములు విద్యాశాఖ అధికారులతో ఏర్పాటుచేసి అన్ని మండలాలలో మౌలిక సదుపాయాలు, ఫర్నీచర్, ఒక్కొక్క పాఠశాలలో ఎంతమంది ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నదీ అదేవిధంగా ఎక్కువమంది విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో ఎంతమంది ఉపాధ్యాయులు అవసరం ఉన్నదీ ఒక నివేదిక తయారు చేసి ఇవ్వాలని ఆదేశించారు. ప్రస్తుతము 11 మండలాల్లో ఒక్కొక్క పాఠశాలలో ఎంతమంది విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉన్నది మండలాల వారీగా ఆరా తీసారు. ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణులయ్యే విధంగా సబ్జెక్టుటీచర్లు విద్యార్థులతో ఎప్పటికప్పుడు అర్థమయ్యే రీతిలో చదివించాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో సహాయక గిరిజన సంక్షేమ శాఖాధికారులు రామతులసి, కష్ణమోహన్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎఒ చక్రధర్

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి

ప్రజాశక్తి- రాజవొమ్మంగి: రైతులు రసాయనిక ఎరువుల వాడకాలు తగ్గించాలని వ్యవసాయ అధికారి చక్రధర్ అన్నారు. మంగళవరం శరభవరం రైతుసేవా కేంద్రం పరిధిలో వనకరాయి గ్రామంలో 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ చక్రధర్ మాట్లాడుతూ నాట్లు వేసుకునే సమయంలో నారు చివర తుంచి నాటుకోవాలని దాని వల్ల కాండం తొలచుపురుగు ఉదతి తగ్గుతుందన్నారు. రైతులు రసాయన ఎరువులు వాడకం తగ్గించుకుని జీవ ఎరువులు వాడుకోవలన్నారు. భూమి కౌలు చేసుకునేవారు గ్రామ వ్యవసాయ అధికారి లేదా గ్రామ రెవెన్యూ అధికారిని సంప్రదించి కౌలుకార్డు తీసుకోవాలని తెలిపారు. గ్రామ సచివాలయంలో అన్నదాత సుఖీభవ అర్హుల జాబితా పెట్టామని ఎవరైనా అర్హులు జాబితాలో పేరు లేకుంటే వ్యవసాయ సహాయకుడిని సంప్రదించాలన్నారు. సర్పంచ్, ఎఇఒ భవాని, విఎఎ సంధ్య, పలువురు రైతులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించని అధికారులపై ఫిర్యాదు

ప్రజాశక్తి- రాజవొమ్మంగి: ప్రభుత్వ భవనాలు, రహదారులు ప్రారంభోత్సవాలకి స్థానిక ప్రజాప్రతినిధులు సమాచారం ఇవ్వకుండా ప్రోటోకాల్ పాటించని అధికారులపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు మండల సర్పంచ్‌ల సమైక్య అధ్యక్షులు కొంగర మురళీకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జడ్డంగిలో సోమవారం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి సొసైటీ గోడౌన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమనికి స్థానిక సర్పంచ్ తనను, అలాగే జడ్డంగి ఎంపిటిసికానేం అచ్చియ్యమ్మను ఆహ్వానించలేదని కనీసం సమాచారం కూడా ఇవ్వలేదని సర్పంచ్ ముకళీకృష్ణ ఆరోపించారు. జడ్డంగి చిన్నయ్యపాలెం రోడ్డు ప్రారంభించినప్పుడు కూడా తమకి సమాచారం ఇవ్వలేదని, సొసైటీ గోడౌన్ ప్రారంభించిన విషయంపై ఎంపిపి గోము వెంకట లక్ష్మి, జడ్పిటిసి వడుగుల జ్యోతికి కూడా సమాచారం లేదని ఈ విషయమై కలెక్టర్, ఐటిడిఎ పిఒకు ఫిర్యాదు చేశామన్నారు.

సారా విక్రయిస్తున్న మహిళ అరెస్టు

ప్రజాశక్తి- విఆర్‌పురం: ఒకుర్తి గ్రామశివారులో ఒక మహిళ అక్రమంగా సారాయి విక్రయిస్తుండగా జడ్డంగి ఎస్ఐ చిన్నబాబు ఆధ్వర్యంలో సిబ్బంది మంగళవారం ఆమెను అరెస్ట్ చేసి, ఆమె వద్దనుండి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చిన్నబాబు తెలిపారు. ఎవరైనా గంజాయి రవాణా చేస్తున్నా, సారా విక్రయిస్తున్నా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజాశక్తి
ఉద్యోగ విరమణ మరియు షష్ఠిపూర్తి శుభాకాంక్షలు

అతి తక్కువ ధరతో మీ ప్రకటన వేయబడును.

మీ సేవలు మరువలేనివి, మీరెక్కడున్నా మీ శ్రేయస్సును కోరుకుంటాం, అందించండి. ప్రజాశక్తి ద్వారా శుభాకాంక్షలు

మీ సహోద్యోగులు, మీ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులలో ఎవరైనా రిటైర్ అవుతున్నారా? మరియు షష్ఠిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు తెలపాలనుకుంటున్నారా? అయితే అందించండి వారికి అభినందన కుసుమాలు, ఆకాంక్షించండి వారి సుఖమయ జీవితాన్ని ప్రజాశక్తి ద్వారా తెలియజేయండి.
ఉద్యోగ విరమణ
షష్ఠిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు

మరిన్ని వివరాలకు మా స్థానిక ప్రతినిధులను సంప్రదించండి

సిటీ	: 9490099125	పూర్ణమార్కెట్	: 9490099676
మధురవాడ	: 8008596645	జగదాంబ	: 9490099434
గాజువాక	: 9849392359	జివియంసి	: 9490099483
అనకాపల్లి	: 8008736188	ద్వారకానగర్	: 9490099672
చోడవరం	: 9490099141	కంచరపాలెం	: 9490099135
నర్సీపట్నం	: 9440280411	మాదవధార	: 9490099675
పాడేరు	: 9490099142		
రంపచోడవరం	: 9440165617		

ఎటిడబ్ల్యుఒ లేక అందని వేతనాలు

ప్రజాశక్తి- హుకుంపేట: మండలంలో ఎటిడబ్ల్యుఒ పోస్టు ఖాళీగా ఉండటంతో పర్మినెంట్ వార్డెన్లు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది, ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్లు, పర్మినెంట్ వర్కర్లు జీతాలు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. జూన్ నెల నుండి కొత్త ఎటిడబ్ల్యుఒ బాధ్యతలు చేపట్టకపోవడంతో గత నెల జీతాల బిల్లులు సమర్పించకుండా పెండింగ్‌లోనే ఉన్నాయి. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో నెల నెలా డైట్ బిల్లులు కూడా సమర్పించలేని పరిస్థితి ఏర్పడింది. నెలంతా కష్టపడి పనిచేస్తున్న వారు వేతనాలు అందని స్థితిలో ఇబ్బందులు పడే స్థితి ఉంది. పెండింగ్ జీతాలను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఐదేళ్లుగా హుకుంపేట ఎటిడబ్ల్యుఒగా పని చేసిన రజిని ప్రస్తుతం డిప్యూటీ డైరెక్టర్‌గా బదిలీ అయిన నేపథ్యంలో మండలానికి ఇప్పటివరకు కొత్త ఎటిడబ్ల్యుఒ పోస్టింగ్ ఇవ్వలేదు. దీంతో జీతాల బిల్లులు మరియు ఇతర పరిపాలనా పనులు నిలిచిపోయినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఐటిడిఎ ఉన్నతాధికారులు దీనిపై దృష్టి పెట్టి, హుకుంపేటకు రెగ్యులర్ ఎటిడబ్ల్యుఒను నియమించి, ఇబ్బందులను తొలగించాలని కోరుతున్నారు.

టిడిపి పంచాయతీ అధ్యక్షునిగా శ్యామ్

మట్టం శ్యాం

ప్రజాశక్తి -అనంతగిరి : మండలంలోని ఎగువశోభ పంచాయతీ టిడిపి కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. మంగళవార ఎన్నికల పరిశీలకుడు డి.వెంకటరమణ పర్యవేక్షణలో జరిగిన ఎన్నికల్లో పంచాయతీ టిడిపి అధ్యక్షునిగా మట్టం. శ్యామ్, ఉపాధ్యక్షులుగా గెమెల. రమేష్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పరిశీలకులు మాట్లాడుతూ, పంచాయతీ పరిధిలో పార్టీ బలోపేతానికి, ప్రజాసమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కొత్త కమిటీ కృషి చేయాలన్నారు. అలాగే ప్రభుత్వం, పార్టీ నిర్దేశించిన కార్యక్రమాలను పంచాయతీ పరిధిలో సక్రమంగా చేపట్టాలని, అర్హులకు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు బుజ్జిబాబు, ఆనందు. పాల్గొన్నారు

అధికారులకు సూచనలు చేస్తున్న జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

అకడమిక్ మోనిటరింగ్ విభాగానికి ప్రతిపాదనలు సిద్ధం చేయండి

- జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం

ప్రజాశక్తి -పాడేరు : అకడమిక్ మోనిటరింగ్ విభాగానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి పి. బ్రహ్మాజీరావు, సమగ్ర శిక్ష ఎపిసి స్వామినాయుడులకు జిల్లా కలెక్టర్ ఎఎస్.దినేష్ కుమార్ ఆదేశించారు. మంగళవారం ఉదయం పిఎంఆర్‌సి సముదాయంలోని ఆహార భద్రత, ఇంజనీరింగ్, ఉపాధి కల్పన, జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష కార్యాలయాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఉద్యోగుల విధి నిర్వహణపై ఆరా తీశారు. అనంతరం ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలను సందర్శించి విద్యార్థుల అభ్యాసన, సామర్థ్యాలను తెలుసుకొని వాటిని పెంచేందుకు దిశానిర్దేశం చేసే విధంగా సమగ్ర శిక్ష, గిరిజన విద్య విభాగాలతో సమన్వయపరచుకొని కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. పిఎంఆర్‌సి భవనాన్ని పరిశీలించి మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. ఐటిడిఎ పాడేరు పిఎంఆర్‌సిలో విధులు నిర్వహిస్తున్న ఎఎంఒ,సిఎంఒ, సమగ్ర శిక్ష కార్యాలయంలో పనిచేయాలని సూచించారు. జిల్లా స్థాయిలో మంచి సబ్జెక్టు టీచర్లను గుర్తించి గ్రేడింగ్ ఇవ్వాలని సూచించారు.

మ్యూటేషన్లను వేగవంతం చేయాలి

- పిజిఆర్‌ఎస్ ఫీడ్ బ్యాక్‌లో నిర్లక్ష్యంపై అసంతృప్తి
- అధికారుతో సమీక్షలో జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు : మ్యూటేషన్ల పనులు వేగవంతం చేయాలని, సంతృప్తికరమైన సేవలు అందించి, పిజిఆర్‌ఎస్ ఫీడ్ బ్యాక్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి సబ్ కలెక్టర్లు, 22 మండలాల రెవెన్యూ అధికారులతో అన్నదాత సుఖీభవ, అగ్రిగోల్డ్ ల్యాండ్, రేషన్ కార్డు సర్వీసెస్, రెవెన్యూ సదస్సులు గ్రీవెన్స్ రెడ్రెస్సల్ స్టేటస్, పీజీఆర్‌ఎస్ రెగ్యులరేషన్, హౌసింగ్, పిబిఎస్ఎల్‌ఎ సర్వీసెస్, ఎపి సేవాపోర్టల్, రెవెన్యూ తదితర అంశాలపై కలెక్టర్ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు.
నేటికీ పెండింగ్‌లో ఉన్న 1130 మ్యూటేషన్ పనులపై మండలాల వారీగా రివ్యూ చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మ్యూటేషన్ల ప్రక్రియ సక్రమంగా జరగడం లేదని అసంతృప్తి వ్యక్తం చేసారు. పిజిఆర్‌ఎస్ నిర్వహణలో జూన్, జూలై నెలలో ఉన్న లోపాలపై మండలాల వారీగా సమీక్షించి పనుల పురోగతిపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారానికి ఫీడ్ బ్యాక్ కీలకమని, సమాచారం కొరకు దిగువస్థాయి సిబ్బందికి పంపడం జరుగుతుందని, తహసీల్దార్ సంతకం లేకుండా పిటిషన్ క్లోస్ చేయకూడదన్నారు. సరైన పరిష్కార చర్యలు చేపట్టకుండా పిటిషన్ క్లోజ్ చేస్తే క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు. పిజిఆర్‌ఎస్‌లో అన్నదాత సుఖీభవ దరఖాస్తులు 890 వివిధ కారణాలతో పెండింగ్లో ఉన్నాయని వ్యవసాయ అధికారి వివరించగా, ఆధార్ నెంబర్ తప్పుగా నమోదు, జాయింట్ పట్టాదారు పాసుబుక్ తదితర కారణాలతో ఉత్పన్నమైన సమస్యలను వారం రోజుల్లో సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు మండల స్థాయిలో అన్ని పిజిఆర్‌ఎస్ గ్రీవెన్స్‌లను పరిష్కరించే విధానాన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి ప్రత్యేకంగా నియమించిన సిబ్బందితో ఆడిట్ చేయించి ఏమైనా లోపాలున్నా, సరిగా పర్యవేక్షించకుండా ముగించినా, అర్జీదారునితో సంబంధిత గ్రీవెన్స్ రెడ్రెస్సెల్ అధికారి మాట్లాడకపోయినా చర్యలు తప్పవన్నారు.
పిజిఆర్‌ఎస్, రెవెన్యూ సమస్యలు పరిష్కారానికి తాహాశీల్దారులు చొరవ చూపించాలన్నారు. ప్రతీ వారం క్షేత్రస్థాయి సిబ్బందితో రివ్యూ చేయాలని సూచించారు. మూడు డివిజన్లలోని సబ్ కలెక్టర్లు సమస్యల పరిష్కారం పై దృష్టి పెట్టాలని చెప్పారు. బదిలీలపై వచ్చిన తహసీల్దార్లు. మ్యాపింగ్ వేగవంతం చేసి
రెవెన్యూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేయాలన్నారు ప్రభుత్వ భూములు కబ్జాకు గురికాకుండా పరిరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఇళ్ల స్థలాలు లేని వారికి పట్టాలు అందించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. అగ్రి గోల్డ్ భూములపై అరకువాలీ, అనంతగిరి తహసీల్దార్లతో సమీక్షించారు. సర్వే నెంబర్ వారీగా పరిశీలించాలన్నారు. చింతూరు, వి.ఆర్ పురం, కూనవరం, ఎటపాక మండలాల తహసీల్దార్లతో వరద పరిస్థితులపై సమీక్షించి, చేపడుతున్న పనులపై సూచనలు చేశారు. వీడియో కాన్ఫరెన్సులో డిఆర్‌ఒ కె. పద్మలత, ప్రత్యేక ఉపకలెక్టర్, పిజిఆర్‌ఎస్ నోడల్ ఆఫీసర్ ఎంవిఎస్ లోకేశ్వర రావు, వర్చువల్‌గా రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ పాల్గొన్నారు..

అధిక దిగుబడులు, ఆదాయమే లక్ష్యం

- 1 నుంచి రైతు సదస్సుల నిర్వహణకు ప్రణాళికలు
- అధికారులతో సమీక్షలో జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు : రైతులకు అధిక దిగుబడులు, ఆదాయం పెంచడమే లక్ష్యంగా రైతు సదస్సుల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలఅని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. వచ్చేనెల ఒకటో తేదీన రైతు సదస్సులు ప్రారంభించాలని, ఆర్గానిక్ పంటలకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. అన్ని శాఖలు సమన్వయంతో గ్రామ స్థాయిలో రైతు సదస్సులు నిర్వహించి, రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. మంగళవారం కలెక్టరేట్ నుండి వ్యవసాయశాఖ, సెరీకల్చర్, మత్స్యశాఖ, ఉద్యానవన, ఎపిఎంఐపి, పశుసంవర్ధక శాఖ, మార్క్‌ఫెడ్, పట్టుపరిశ్రమ, మార్కెటింగ్, గ్రామీణ నీటి సరఫరా గనులు భూ గర్భశాఖ, ట్రయిబుల్ వెల్ఫేర్ పి.ఆర్ ఇంజనీరింగ్, ఆర్.అండ్.బి, ఫుడ్ సేఫ్టీ తదితర శాఖలలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు.
వచ్చేనెల ఒకటి నుంచి రైతు సదస్సుల నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా వ్యవసాయ అధికారికి ఆదేశించారు. మండల వ్యవసాయ అధికారులతో జిల్లా కలెక్టర్ విత్తనాల పంపిణీపై ఆరాతీశారు, విత్తనాలు అవసరమైతే తెలియజేయాలన్నారు. మండలాల వారీగా రాగి, వరి పంటలపై ఆరాతీశారు. రైతులకు అవగాహన కల్పించి పంటల బీమా చెల్లించేలా చూడాలన్నారు. ్నదాత సుఖీభవ పెండింగ్ దరఖాస్తులు వివిధ కారణాలతో పెండింగ్లో ఉన్నాయని, వాటిని పరిష్కరించే దిశగా సత్వర చర్యలు చేపట్టాలన్నారు. రైతులకు పూర్తి స్థాయిలో యూనిక్ ఐడి ఇవ్వడానికి చేర్యలు చేపట్టాలన్నారు. సెరీకల్చర్‌పై సమీక్షలో మల్బరీ సాగును విస్తరించాలని సూచించారు. ఉద్యాన రైతులకు పంపిణి చేసిన పరికరాలపై ఆరా తీశారు. పాడేరు మండలంలో కాఫీ రైతులకు మిరియాల శుద్ధి యంత్రాలు, బేబీ పల్పర్లు పంపిణీపై ఆరాతీశారు. పశుసంవర్ధక శాఖ సమీక్షలో జి.కె వీధిలో వ్యాక్సినేషన్ స్టోరేజీపై ఆరాతీశారు. జూలై నెలాఖరు నాటికి పశువులకు వ్యాక్సినేష్, గొర్రెలకు, మేకలకు డీ వార్మింగ్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. మండలాల వారీగా గోకులాల నిర్మాణాలపై సమీక్షించి ఆగష్టు నెలాఖరు నాటికి పూర్తి చేయాలన్నారు. గ్రామీణ నీటి సరఫరా, స్వచ్ఛ సర్వే 2025 నిర్వహణ,. ఎపిఎంఐపి, మార్క్‌ఫెడ్, పట్టుపరిశ్రమ, మత్స్య, మార్కెటింగ్, గనులు భూ గర్భశాఖ, ట్రయిబుల్ వెల్ఫేర్ పి.ఆర్ ఇంజనీరింగ్, ఆర్అండ్‌బి, ఫుడ్ సేఫ్టీ శాఖలపై సమీక్షించి పలు సూచనలు అందజేశారు.
సమావేశంలో రంపచోడవరం ఐటిడిఎ పిఒ కె. సింహాచలం, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బిఎస్.నంద్, జిల్లా సెరీకల్చర్ అధికారి అప్పారావు, సిపిఒ పి.ప్రసాద్, పశు సంవర్ధక శాఖ డిడి వి.జయరాజు, జిల్లా ఉద్యాన అధికారి ఎ. రమేష్‌కుమార్, జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి ఎ.రాజశేఖరం, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాసరావు, 22 మండలాల ఎంపిడిఒలు పాల్గొన్నారు.

సత్కరిస్తున్న సర్పంచ్ సత్యవతి

బదిలీ సచివాలయ సిబ్బందికి సత్కారం

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని సుకూరు పంచాయతీలో బదిలీపై వెళ్లిన సచివాలయ సిబ్బందికి మంగళవారం ఘనంగా సత్కరించారు. బదిలీపై వెళ్లిన ఎఎన్ఎం, సర్వేయర్, వెటర్నరీ అసిస్టెంట్, అలాగే రిటైర్మెంట్ పొందిన ఆశ కార్యకర్తను స్థానిక సర్పంచ్ ధనసాని సత్యవతి ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, సచివాలయంలో అందించిన వారి సేవలను కొనియాడారు. కోవిడ్ సమయంలో ప్రజలకు విశేషమైన సేవలు అందించి పంచాయతీ ప్రజల మన్ననలు పొందారని తెలిపారు. బదిలీపై వెళ్లిన చోట కూడా మరింత మెరుగైన సేవలు అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ప్రమోషన్లు పొంది, అధికారులు, ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ సరోజిని, విఆర్‌ఒ కొండమ్మ, వార్డు సభ్యులు, పీసా కమిటీ సభ్యులు, నాయకులు మురళి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.
జి మాడుగుల : మండలంలోని వంతాల సచివాలయంలో బదిలీపై వేరే మండలాలకు వెళ్తున్న సిబ్బందిని మంగళవారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు కార్యక్రమంలో సర్పంచ్ జి పద్మ, వైస్ సర్పంచ్ తిరుపతమ్మ ఎంపిటిసి కల్యాణి,౼ సక్రటరీ శేఖర్, వార్డు మెంబర్లు పీసా కమిటీ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు

జి.మాడుగులో సచివాలయ సిబ్బందికి సత్కారం

షెడ్యూల్ తెగల కోసం ప్రత్యేక డిఎస్‌సి నిర్వహించాలి

ప్రజాశక్తి -తగరపువలస : షెడ్యూల్ ప్రాంతాల్లో షెడ్యూల్ తెగల కోసం ప్రత్యేక డిఎస్‌సి నిర్వహించాలని కోరుతూ ఎపి గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎస్.భార్గవికి జివిఎంసి రెండో వార్డుకు చెందిన సుందరమ్మ రామన్న చెట్టి వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ చెట్టి అశోక్ చక్రవర్తి మంగళవారం వినతి పత్రం అందజేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా, పాడేరులోని సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థలో గిరిజన చట్టాలపై నిర్వహించిన వర్క్ షాప్‌నకు హాజరైన గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ భార్గవిని కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేసినట్లు అశోక్ చక్రవర్తి తెలిపారు. జిఒ3 ను పునరుద్ధరించాలని, కమ్యూనిటీ ప్రభావ ఆధారాలు, చట్ట పరమైన దృఢత్వంతో షెడ్యూల్ తెగల వారికి వంద శాతం రిజర్వేషన్ పునరుద్ధరించేలా కొత్త జిఒ జారీ చేయాలని కోరారు.

సర్టిఫికెట్ల పరిశీలన గడువు పొడిగింపు

ప్రజాశక్తి -భీమునిపట్నం : డిఇఇ సెట్ -2025 సర్టిఫికెట్ల పరిశీలన గడువును ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నెల 24వ తేదీ వరకు పొడిగించినట్లు స్థానిక డైట్ ప్రిన్సిపల్ ఎల్.సుధాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ ఈ నెల 17 న ప్రారంభమై 22తో ముగిసిన విషయం విదితమే.

వినతిపత్రం అందిస్తున్న ఆశావర్కర్స్ యూనియన్, సిఐటియు నాయకులు

సంయుక్త సమావేశం ఏర్పాటు చేయాలి

- ఎపి ఆశా వర్కర్స్ యూనియన్

ప్రజాశక్తి- రంపచోడవరం : ఆశావర్కర్స్ సమస్యల పరిష్కారం కోసం వైద్య, ఆరోగ్యశాఖ అధికారులతో సంయుక్త సమావేశం వెంటనే ఏర్పాటు చెయ్యాలని మంగళవారం ఐటిడిఎ పిఒ, అడిషనల్ డిఎంహెచ్ఒకు ఆశావర్కర్స్ యూనియన్ సిఐటియు అనుబంధ నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మట్ల వాణిశ్రీ మాట్లాడుతూ అన్ని జిల్లాల్లో ఆశావర్కర్స్ యూనియన్ నాయకులతో వైద్యఆరోగ్యశాఖ అధికారులు సంయుక్త సమావేశాలు నిర్వహించారని, అల్లూరి జిల్లాలో కూడా సమావేశం జరిగినప్పటికీ రంపచోడవరం, చింతూరు రెండు ఐటిడిఎల పరిధిలో ప్రత్యేకంగా సంయుక్త సమావేశం జరపాలని యూనియన్ తరపున జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు డిమాండ్ చేయగా ఎప్పుడు నిర్వహిస్తామన్నది చెప్తామన్నారు. 9 నెలలుగా వేతనాలు ఆపేశారని ఆరోపించారు. తక్షణమే సంయుక్త సమావేశం ఏర్పాటు చెయ్యాలని లేని పక్షంలో సమ్మె చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కంభం శాంతిరాజు యూనియన్ జిల్లా ముఖ్య లీడర్స్ వెంకటలక్ష్మి,వీరలక్ష్మి,మంగ,మార్త, లాలీబాయ్,శాంతమ్మ పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

కారం పిచ్చిరెడ్డి మృతి తీరని లోటు

ప్రజాశక్తి -కూనవరం : మండలంలోని కూటూరు గ్రామానికి చెందిన సిపిఎం సీనియర్ నాయకులు కారం పిచ్చిరెడ్డి మృతి చెందారు. ఆయన పార్థివదేహాన్ని సందర్శించి సిపిఎం నాయ కులు నివాళులర్పించారు. అనంతరం పార్టీ జిల్లా కమిటి సభ్యులు మేకల నాగేశ్వరావు మాట్లాడుతూ పిచ్చిరెడ్డి పార్టీకి ఎన్నో ఏళ్లుగా సేవలందించారని, పోడు భూములు, అటవీహక్కుల పోరాటాల్లో చురుగ్గా పాల్గొన్నారని గుర్తు చేసారు. వెట్టిచాకిరీ విధానాలపై పోరాటం చేసారని గుర్తు చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య, జిల్లా కమిటి సభ్యులు పాయం సీతారామయ్య శ్రీరాములు పాల్గొన్నారు.

లోవోల్టేజీ సమస్య పరిష్కారం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలోని స్థానిక మెట్టవీధిలో ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి చొరవతో విద్యుత్ లో వోల్టేజ్ సమస్య పరిష్కారం అయిందని టిడిపి మండల అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు మంగళవారం తెలిపారు. ఇటీవల ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి విజయభాస్కర్ దంపతులు సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా రాజఒమ్మంగిలో పర్యటించిన నేపథ్యంలో మెట్టవీధి ప్రజలు తమకు లో ఓల్టేజి సమస్య ఉందని తెలిపారు. సంబంధిత అధికారుల తో ఎమ్మెల్యే మాట్లాడి విద్యుత్ స్తంభాలతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేసి సమస్య పరిష్కరించారు. ఎమ్మెల్యే శిరీషదేవికి, సర్పంచ్ రమణికి, టిడిపి మండల అధ్యక్షులు పెద్దిరాజుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

పోరాటయోధుడు అచ్యుతానందన్

సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో నివాళి

రంపచోడవరం: నివాళులర్పిస్తున్న సిఐటియు జిల్లా అధ్యక్షురాలు వాణిశ్రీ, శాంతిరాజు

చింతూరు: నివాళులర్పిస్తున్న సిపిఎం జిల్లా కమిటి సభ్యులు సురేష్ తదితరులు

ప్రజాశక్తి - రంపచోడవరం : పోరాటయోధుడు అచ్యుతానందన్ అని సిఐటియు జిల్లా అధ్యక్షురాలు మట్ల వాణిశ్రీ, జిల్లా ఉపాధ్యక్షులు శాంతి రాజు అన్నారు. మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో ఆయన మృతికి నివాళు లర్పించారు. అచ్యుతానందన్ కేరళ ముఖ్యమంత్రిగా, మూడుసార్లు ప్రతిపక్షనేతగా పనిచేశారన్నారు. ఏడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారని, 2006-11 మధ్య ఆయన కేరళ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారని, అనేక పోరాటాలకు నాయకత్వం వహించారని, సిపిఎం వ్యవస్థాపనలో ఆయన కూడా ఒకరని గుర్తు చేసుకున్నారు. 1980 నుండి 1991 వరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారని ఆయన మృతి కార్మిక, కర్షక కష్టజీవులకు పార్టీ కార్యకర్తలకు సిపిఎం పార్టీకి తీరని లోటన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు పాల్గొన్నారు.
చింతూరు : కేరళ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి విఎస్ అచ్యుతానందన్ చిరస్థాయిగా ప్రజల గుండెల్లో జీవించే ఉంటారని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సీసం సురేష్ అన్నారు, మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు.కార్యక్రమంలో మండల కమిటి సభ్యులు పోడియం లక్ష్మణ్ కారంసుబ్బారావు, పల్లపురాములు, జల్లి నాగేశ్వరరావు, రాజు, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

అరకు : అచ్యుతానందన్‌కు నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

అరకులోయరూరల్: కేరళ మాజీ ముఖ్యమంత్రి విఎస్ అచ్యుతానందన్ మరణం తీరనిలోటని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి ఉమామహేశ్వరరావు అన్నారు. అచ్యుతానందన్ మృతికి సంతాపంగా మంగళవారం ఆయన చిత్రపటానికి సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, కేరళ రాష్ట్రానికి 2006 నుంచి 2011 వరకు ముఖ్యమంత్రిగా వ్యవహరించిన అచ్యుతానందన్, నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి అనేక ఒడిదుడుకులను తట్టుకొని కమ్యూనిస్టు నాయకుడిగా మచ్చలేని ప్రజలకు సేవలు అందించారని కొనియాడారు.
ఎమర్జెన్సీ కాలంలో అనేక నిర్బంధలకు తట్టుకొని ప్రజా పోరాటమే ఊపిరిగా సమ సమాజ నిర్మాణం కోసం పనిచేశారన్నారు .అచ్యుతానందన్ మరణంతో కమ్యూనిస్టు పార్టీకి తీరనిలోటన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు, నాయకులు పాంగి రామన్న, పి బాలకృష్ణ, ఎస్ ఐసుబాబు పాల్గొన్నారు.

ఉధృతంగా వాగులు, గెడ్డలు

- గొల్లపల్లి - నడిమివీధి మధ్య పెద్దవాగు ఉధృతి
- అన్నవరం, ఉమ్మడివరం మధ్య పొంగిపొర్లుతున్న వెదుర్లవాగు
- నిలిచిపోయిన రాకపోకలు

జికెవీధి మండలం గొల్లపల్లి వద్ద రోడ్డుపై ప్రవహిస్తోన్న పెద్దవాగు

ఉధృతంగా ప్రవహిస్తున్న వెదుర్లవాగు

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం అమ్మవారి దారకొండ పంచాయతీ గొల్లపల్లి, నడిమివీధి మధ్య పెద్దవాగు ప్రవహిస్తుంది. పెబ్బంపల్లి తడకపల్లి గ్రామాలకు కూడా ఈ వాగుపై నుంచే రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఏ చిన్న అవసరం వచ్చినా వాగు దాటి ఆర్‌వి నగర్ వెళ్లాల్సి వస్తోంది. వంతెన నిర్మాణానికి ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ అధికారులు ఒక కోటి 80 లక్షలకు అంచనా వ్యయం తయారు చేసి ప్రభుత్వానికి నివేదిక అందించారు. అయినా అధికారులు నిర్లక్ష్యం కారణంగా ఇప్పటివరకు పనులు కార్యరూపం దాల్చలేదు. దీనిపై సిపిఎం గాలకొండ ఎంపిటిసి అంపరంగి బుజ్జిబాబు పలుమార్లు జికె వీధి జనరల్‌బాడీ సమావేశంలో నిలదీసినా ఉపయోగం లేకుండా పోయింది. నాలుగు గ్రామాల్లో సుమారు 400 మంది పైగా ఇక్కడ నివసిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి వంతెన, రహదారి నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.
వి.ఆర్ పురం: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అన్నవరం ఉమ్మడివరం మధ్య వెదుర్లవాగు ఉధృతంగా పొంగి ప్రవహిస్తోంది. గతంలో ఉన్న హైలెవెల్ వంతెన కూలిపోవడంతో ప్రత్యామ్నాయంగా తాత్కాలిక వంతెన నిర్మించారు. ఈవంతెన ఎత్తు తక్కువగా ఉండడం వలన చిన్నపాటి వర్షం కురిసినా వరద నీరు పొంగి ప్రవహిస్తోంది. వాగుపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం చేపడితే తప్ప సమస్య పరిష్కారమయ్యే అవకాశం లేదు. బ్రిడ్జికి దాదాపు రెండుకోట్ల వ్యయంతో అంచనాలు వేసి సంబంధిత అధికారులకు పంపినట్లు సమాచారం. బ్రిడ్జిని తహశీల్దార్ సరస్వతి, విఆర్‌పురం పోలీస్‌సిబ్బంది మంగళవారం పరిశీలించి ప్రయాణికులను నీరు తగ్గేవరకు రాకపోకలు సాగించవద్దని సూచించారు.

26న జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు

ప్రజాశక్తి - విశాఖకలెక్టరేట్ : జిల్లా ప్రజాపరిషత్, విశాఖపట్నం స్థాయి సంఘ సమావేశాలు ఈనెల 26న జరుగుతాయని, జిల్లా ప్రజా పరిషత్ సిఇఒ నారాయణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటి నుండి ఏడు స్థాయీ సంఘాల సమావేశాలు జిల్లా ప్రజాపరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన జిల్లా ప్రజాపరిషత్ సమావేశ మందిరం, వి.సి.సమావేశ మందిరంలో నిర్వహిస్తామన్నారు.

ఎఐఎన్‌యులో కిడ్నీ మార్పిడి విజయవంతం

- కుమారుడికి కిడ్నీ దానం చేసిన తండ్రి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : క్యాన్సర్‌పై విజయం సాధించిన తండ్రి తన 37 ఏళ్ల కుమారుడికి తన కిడ్నీదానం ఇచ్చి రెండో జీవితం అందించిన సంఘటన డైమండ్ పార్క్ వద్ద ఏషియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ (ఎఐఎన్‌యు) ఆసుపత్రిలో చోటు చేసుకుంది. ఆసుపత్రి నెఫ్రాలజిస్టులు తండ్రి కిడ్నీ తీసి కుమారునికి అమర్చారు. 60 ఏళ్ల ఎడ్ల పైడయ్యకు రెండేళ్ల క్రితం ఉదర క్యాన్సర్ రావడంతో శస్త్రచికిత్స చేశారు. ఎంత క్లిష్ట పరిస్థితిలో ఉన్నప్పటికీ, తన కుమారుడి ప్రాణాలు నిలబెట్టాలని ఆయన గట్టి సంకల్పం తీసుకున్నారు. సమగ్ర వైద్యపరీక్షలు చేసి, పెట్ సిటి స్కాన్ తీసి, ఆంకాలజిస్ట్ నుంచి అనుమతి తీసుకున్న తర్వాత ఆయన కిడ్నీ దానానికి అర్హులని వైద్యులు నిర్ధారించారు. కుమారుడు లక్ష్మణుడు కిడ్నీ వైఫల్యం కారణంగా అప్పటికే డయాలసిస్ చేయించుకున్నాడు. పరీక్షల కోసం వారిద్దరూ ఎఐఎన్‌యుకు వచ్చారు. మంగళవారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కన్సల్టెంట్ నెఫ్రాలజిస్టులు డాక్టర్ ఉదయ్‌దీపక్‌రావుగజారే మీడియాతో మాట్లాడుతూ, ఇది కేవలం వైద్యపరమైన విజయంకాదని, ప్రేమ,త్యాగాలకు నిజమైన నిదర్శనం అన్నారు. మామూలుగా కుమారుడికి తండ్రి కిడ్నీ ఇచ్చి కాపాడటమే అసాధారణం. అటువంటిది దానికి తోడు క్యాన్సర్ విజేత కావడం మరింత గొప్ప విషయం అన్నారు. ఈ మొత్తం చికిత్సలో తాము భాగమైనందుకు తాము ఎంతో గర్విస్తున్నామని చెప్పారు. అనుభవజ్ఞులైన యూరాలజీ బృందం, ట్రాన్స్‌ప్లాంట్‌సర్జన్ల నేతృత్వంలో ఈ శస్త్రచికిత్స జరిగిందన్నారు. సీనియర్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్, ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి.రవీంద్రవర్మ, సీనియర్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్, ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అమిత్‌సాప్లే, కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డాక్టర్ పి.శ్రీధర్ మాట్లాడుతూ దాతకు ఇంతకుముందు ఉదరశస్త్రచికిత్స కావడంతో ఈ శస్త్రచికిత్స చాలా సంక్లిష్టమైందని అయితే సరైన ప్లానింగ్, బృందంగా సమన్వయంతో చాలా ప్రశాంతంగా జరిగిందని తెలిపారు.